క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి అభినందన



నల్లబెల్లి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మండలంలోని గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన ఆ పార్టీ జిల్లా కోకన్వీనర్ కలువల త్రిలోకేశ్ వరంగల్‌లో శుక్రవారం కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందించి వాలువాతో సత్కరించారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

నర్సంపేట : పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆ కులస్తులు, మహిళలు పెద్దమ్మ తల్లికి ఆలయంలో శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. తొలుత మహిళలు, ముదిరాజ్ కులస్తులు డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో ఆలయానికి ర్యాలీగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పలు పార్టీల నాయకులు పూజ చేశారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : ముద్దునూరులో కుమ్మరులు ఆషాఢ మాసం బోనాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమారస్వామి మాట్లాడారు. మట్టి కుండల్లో బోనం వండి సమర్పించాలని కోరారు. వేడుకల్లో పాలడుగుల నాగరాజు, రాజు, మొగిలి, ఐలయ్య పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఇద్దరిపై కేసు

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని బెల్టు షాపులపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి ఇద్దరి నుంచి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు రెండో ఎస్సై మంగ తెలిపారు. కానిస్టేబుల్లు శ్రీనివాస్, అశోక్, సురేశ్ ఆధ్వర్యంలో కొయ్యడ వెంకన్న ఇంటి నుంచి రూ.23,200 విలువైన, హెడ్ కానిస్టేబుల్ పి.బుచ్చయ్య ఆధ్వర్యంలో కానిస్టేబుల్లు దామోదర్, బుచ్చిరాజు కొయ్యడ కుమారస్వామి ఇంటి నుంచి రూ.8,600 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం



గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై ఇటీవల కారు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఇద్దరికి బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు శిరిసె శ్రీకాంత్ శుక్రవారం ఆర్థికసాయం అందించారు. నల్లగొండ శ్రీదేవికి రూ.10 వేలు, రామకృష్ణకు రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుధీర్, తాటికొండ నరేందర్, నేతాజీ సర్వీస్ టీమ్ అధ్యక్షుడు మొగసాని శంకర్, నాయకులు పోలీస్ ఆనంద్, వజ్ర విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

రాయపర్తి : నేటి ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్యగౌడ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు సభలో ప్రసంగిస్తారని తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి 5 వేల మందిని తరలిస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా అధికార ప్రతినిధి గద్దం నరేందర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె అనిల్, నియోజకవర్గ కన్వీనర్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై 31న సమావేశం

గీసుకొండ : ఎంపీపీ బీమగాని సౌజన్యపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో ఈనెల 31న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ మహేందర్‌జీ శుక్రవారం నోటీసు జారీ చేశారు. నోటీసును ఎంపీపీతోపాటు ఏడుగురు ఎంపీటీసీలకు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

జనగామ రూరల్ : ఓ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామలో శుక్రవారంచోటు చేసుకుంది. వరంగల్‌జిల్లా రాయపర్తి మండలంలోని కొండూర్‌కు చెందిన సాగారపు కుమారస్వామి, యాకలక్ష్మి దంపతులు జనగామలోని సూర్యాపేట రోడ్డులో అద్దెకు ఉంటున్నారు. వారి కూతురు శ్రావణి (16) ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకుంది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా శ్రావణి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



సంగెం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

● అధికారులపై ఎమ్మెల్యే రమేశ్ అసహనం

వర్ధన్నపేట : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని విద్యుత్, ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పష్టం చేశారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలువురు సభ్యులు వివరించిన సమస్యలపై విద్యుత్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు దాటవేత ధోరణి అవలంబించడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పనులు త్వరితగతిన నిర్వహించేలా విద్యుత్, ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షిస్తామని చెప్పారు. వైద్య శాఖ వర్ధన్నపేట అధికారులు హాజరు కాకపోవడంతో రాయపర్తి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్ హాజరు కాగా వైద్యసేవలపై ఆయన్ను ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదన్నారు. వర్ధన్నపేట పరిధిలోని గ్రామాలను రాయపర్తి పీహెచ్‌సీలో కలపడంతో సమస్య ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. తాత్కాలికంగా ఇల్లందలో ఉన్న పీహెచ్‌సీని పూర్తిస్థాయి పీహెచ్‌సీగా ఏర్పాటు చేయడానికి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చొరవ చూపాలని ఎంఈఓ రంగయ్యకు ఎంపీపీ అప్పారావు సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య తగ్గుతున్న క్రమంలో ప్రీ ప్రైమరీ ప్రైవేట్ స్కూళ్లకు అనుమతి ఇవ్వొద్దని సభ్యులు సూచించారు. పలు శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

సంగెం : బీఆర్ఎస్ హయాంలోనే పల్లెలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామాలవారీగా సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకుల హయాంలో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలంటే ఏం అభివృద్ధి పనులు చేశారని నిలదీస్తారని అధికారులు, పాలకులు భయంతో వణికిపోయేవారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుండడం కళ్లకు కనపడుతోందని చెప్పారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు త్వరలో పరిహారం అందిస్తామన్నారు. త్వరలోనే మండలంలోని గవిచర్ల గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పల్లారుగూడలో సబ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలతోపాటు ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో సీటు రాని విద్యార్థులందరిని బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో చేర్పించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. నిర్మాణంలో ఉన్న పంచాయతీ, మహిళ సంఘ భవనాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని చెరువులను, కట్టలను, తూములను, షట్టర్లను, మత్తళ్లను పరిశీలించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పారు. అవసరమైన చోట సకాలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలో పూర్తి చేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



నర్సంపేట : మాట్లాడుతున్న రాజాసాహెబ్



నర్సంపేట రూరల్ : అరెస్టైన నాయకులు

నర్సంపేట : అక్రమ అరెస్టులతో ప్రజాఉద్యమాలను ఆపలేరని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని సభను విజయవంతం చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం అక్రమ అరెస్టులను చేయిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కైనట్టు ధ్వజమెత్తారు. సమావేశంలో ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, నాగెల్లి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

పట్టణంలో నిర్వహించిన యూఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఎన్నికల హామీలను విస్మరించిన క్రమంలో ప్రధాని రాష్ట్రానికి రావడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు రాజు, రవి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత తరహా పాలన

నర్సంపేట రూరల్ : రాష్ట్రంలో నియంత తరహా పాలన సాగుతోందని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ప్రతిపక్షాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడారు. ముందస్తు అరెస్ట్‌లను ఖండించారు. అరెస్టైన వారిలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ సెల్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, నర్సంపేట మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, కౌన్సిలర్లు విజయ్‌కుమార్, నాయకులు విజేందర్‌రెడ్డి, పంజాల రమేశ్ తదితరులున్నారు.

చెన్నారావుపేట : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, బీఎల్ఎఫ్ నాయకుడు వెంకన్నలను పోలీసులు అరెస్ట్ చేశారు. .

పర్వతగిరి : ఎంపీటీసీ బొట్ల మహేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వర్ధన్నపేట : ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో కాంగ్రెస్ నాయకులు చిదరాల కుమారస్వామి, అఖిల్, సీపీఐ నాయకులు ఆరెల్లి రవి తదితరులున్నారు.

నెక్కొండ : పోలీసులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు బోడ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రావణ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అశోక్, చెన్నకేశవులు, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. పోలీసులు ప్రతిపక్షాల నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వాహనాలకు ఇబ్బందులు



మొరం పోయకపోవడంతో గుంతలు

నర్సంపేట రూరల్ : కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వాహనాలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. నర్సంపేట సర్వాపురంలోని 5 వార్డులో సైడ్ డ్రైనేజీ పోసి పక్కకు మొరం పోయకుండా వదిలేయడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాంట్రాక్టర్ సైడ్ డ్రైనేజీ నిర్మించాక కనీసం మొరం పోయకపోవడంతో గుంతలు తయారయ్యాయి. సైడ్ డ్రైనేజీ తీసినప్పుడు సదరు మట్టిని కాంట్రాక్టర్ ట్రాక్టర్లలో బయటకు తరలించి చేతులు దులుపుకోవడంతో సమస్య తలెత్తిందని ప్రజలు విమర్శిస్తున్నారు. మొరం పోయకపోవడంతో రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. సదరు రోడ్డుకు రెండు సార్లు సీసీ మంజూరైనా మళ్లీ వేరే చోట సీసీ రోడ్డు సదరు రోడ్డును నిర్లక్ష్యం చేశారన్న అపవాదు ఉండగానే డ్రైనేజీలు నిర్మించి మొరం పోయకుండానే నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసులు బహిరంగంగానే విమర్శించారు. సదరు రోడ్డు మీదుగా విద్యార్థులను బడికి తీసుకెళ్లే బస్సులు తిరగడం పరిపాటి. ఉన్నతాధికారులు స్పందించి సైడ్ డ్రైనేజీ పక్కకు మొరం పోయించాలని, రోడ్డుకు సీసీ వేయించాలని జనం కోరుతున్నారు.

‘ఆల్ఫోర్స్ స్కూల్‌ను సీజ్ చేయాలి’



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వర్ధన్నపేట : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్న క్రమంలో ఆల్ఫోర్స్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆల్ఫోర్స్, శ్రీ చైతన్య పాఠశాలల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. ఆల్ఫోర్స్, శ్రీ చైతన్య పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు విక్రయించడంతోపాటు ఇతర పలు అక్రమ పద్ధతుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. పోలీసులు ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి తదనంతరం వదిలేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, కార్తీక్, రేవంత్, రాకేశ్, శివ, శశాంక్, రాంచరణ్, ప్రశాంత్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నర్సంపేట : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వర్ధన్నపేటలో..



దుగ్గొండి : గిర్నిబావిలో..

నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, రాంనగర్ ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఆ పార్టీ జెండాను నాయకులు ఎగరేశారు. అలాగే మంద కృష్ణ 58వ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద రాజు, జాతీయ నాయకుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్, జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని సూచించారు. వరంగల్ పర్యటన సందర్భంగా వర్గీకరణపై ప్రధాని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ తడుగుల విజయ్, నాయకులు బోయిని నారాయణ, మునిగె యాకోబు, వేల్పుగొండ రాజు, మాదాసి బాబు, తడుగుల శేఖర్, హనుమకొండ రాములు, గుండేటి సురేశ్, సంకినేని కృష్ణ, మంద సుధాకర్, మాదాసి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని కోనాపురంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఈరెల్లి శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులు పెట్టడం లేదన్నారు. ఇకనైనా పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎలకట్టె భాస్కర్, సోమయ్య, దయాకర్, అభినయ్ పాల్, ఎల్లయ్య, హరీశ్, హర్షవర్ధన్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలో ఎమ్మాపెస్ జెండాను ఆ పార్టీ నర్సంపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్ వడ్డూరి కుమారస్వామి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, ఉపాధ్యక్షుడు కసుకుర్తి శ్రీనివాస్, నాయకులు కందిక వీరస్వామి, మంద సురేష్, గాలి అనిల్, ఎల్లయ్య పాల్గొన్నారు.

దుగ్గొండి : గిర్నిబావిలో ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా కన్వీనర్ రాజశేఖర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పర్లపెల్లి బాబు, దీపక్, కొంగర సమ్మయ్య, ఐనుముల పూర్ణయ్య, నల్లబెల్లి అనిల్, గద్దల అశోక్, హన్మకొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల, కొమ్మాల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలు, మంద కృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు పూర్ణయ్య, నాయకులు చిన్నపెల్లి రవి, స్పందన్, డక్క కిరణ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని మొండ్రాయిలో వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. తొలుత నాయకులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడ కుమారస్వామి, మల్లేశం, నాయకులు యాకయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆకులపెల్లి ఉప్పలయ్య జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళ మండల అధ్యక్షురాలు మాదాసి లత, మండల ఉపాధ్యక్షురాలు పైసా రజిత, గ్రామ అధ్యక్షురాలు బొమ్మకంటి ప్రేమలత, ఇసంపెల్లి ఐలయ్య, చిలువేరు యాకోబు, సాంబయ్య పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న వెంకటయ్య



దుగ్గొండి : మాట్లాడుతున్న మల్లేశం



రాయపర్తి : మాట్లాడుతున్న ఉప్పలయ్య



సంగెం : సమ్మె చేస్తున్న కారోబార్లు, సిబ్బంది

నర్సంపేట రూరల్/ఖానాపురం : గ్రామ పంచాయతీ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు వెంకటయ్య అన్నారు. నర్సంపేట, ఖానాపురంల్లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాల వద్ద ఆవరణలో జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో సమ్మె దీక్షలో భాగంగా జీపీ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలకు ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం సంఘీబావం తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులను ఫర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

రాయపర్తి : మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గూడెల్లి ఉప్పలయ్య హాజరై మాట్లాడారు.

సంగెం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కారోబార్లు చేపట్టిన సమ్మెలో జేఏసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పోశాల రమేశ్, గుగులోతు సుమన్ మాట్లాడారు.

నెక్కొండ : స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో జీపీ మల్టీ పర్పస్ వర్కర్ల సమ్మె సీపీఎం మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్న సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం జీపీ మల్టీ పర్పస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్య నరేష్ ఉపాధ్యక్షుడు ఈదునూరి సాయిలు మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల అన్ని సమస్యలనూ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కొత్త జీపీలతో పల్లెల సమగ్రాభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

ఖానాపురం : కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్ జర్పుల అశోక్ తెలిపారు. మండలంలోని అయోధ్యనగర్‌లో ఈజీఎస్ నిధుల్లోంచి మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా పంచాయతీలను ఏర్పాటు చేశాక పల్లెల రూపురేఖలు మారిపోతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూస లింగయ్యార్తి, సొసైటీ డైరెక్టర్ రవీందర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తహసీల్దార్ పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

చెన్నారావుపేట : ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోసం మండలంలోని ఈర్యతండా, అక్కల్‌చెడ, నంబర్‌వన్ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధుసూదన్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వ పాఠశాల భవనాలను పరిశీలించినట్టు తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా సమీపంలోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పరిశీలనకు ఆదేశించిందని చెప్పారు. ఆయన వెంట వీఆర్ఏలు కృష్ణప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

బీఆర్ఎస్ యువజన కమిటీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట : సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి కేటీఆర్ నర్సంపేట నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయిని వేణుచంద్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుశ్యంత్‌రెడ్డి, వేణుచంద్ మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి ఫలితంగానే ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మెహందీ వేడుక



చెన్నారావుపేట : ఆషాఢం వచ్చిందంటే గోరింటాకు ఇష్టపడని మహిళలు ఉండరు. అందానికి అందం, ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని తెచ్చిపెడుతుంది. ఎవరి చేతులు, కాళ్లు చూసినా గోరింటాకుతో అందంగా కనిపిస్తాయి. అందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులు, ఉపాధ్యాయినులు గోరింటాకు తెచ్చి మెహందీ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు.